నేనున్నా..స్టీరింగ్ పట్టన్నా...



ఆటో, క్యాబ్ డ్రైవరన్నలకు వెన్నుదన్నుగా జగనన్న

- మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా ఏటా రూ.10వేల ఆర్థిక సాయం
- 5 ఏళ్లుగా ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సాయం
- నియోజకవర్గంలోని డ్రైవర్లకు రూ.1.06 కోట్ల అందజేత
- వాహనాల నిర్వహణ, బీమా చెల్లించడానికి ఉపయోగపడిన ఆర్థికసాయం
- వైఎస్ జగన్ మేలును మరచిపోలేమంటున్న డ్రైవర్లు

మడకశిర: వాళ్లకు తెలిసింది స్టీరింగ్ పట్టడం.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చడం ..ఈక్రమంలో గతంలో ఎన్నో సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కంతుల చెల్లింపులు, వాహనాల మరమ్మతులకు, బీమా మొత్తం చెల్లించేందుకు చేతిలో చిల్లిగవ్వలేక అల్లాడి పోయారు. గిరాకీలు లేక ఆదాయం అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జగనన్న ప్రతిపక్షంలో ఉండగా వీరి దుస్థితిని కళ్లారా చూశారు. ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు జననేతను కలిసి తమ కష్టాలను చెప్పుకున్నారు. తాను అధికారంలోకి వస్తే ఆర్థికంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆ మాట జగనన్న తప్పలేదు. జగన్ 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని అమలు చేశారు. డ్రైవర్లకు ఏటా రూ.10వేలు అందిస్తున్నారు. ఐదేళ్లుగా ఈపథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు. ఏటా తమ బ్యాంకు ఖాతాలకు రూ.10వేలు జమ అవుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతున్నాయని డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.06 కోట్ల లబ్ధి పొందిన డ్రైవర్లు

నియోజకవర్గవ్యాప్తంగా ఈ పథకం ద్వారా డ్రైవర్లకు ఏటా రూ.10వేలు చెల్లించారు. మొత్తం ఐదేళ్లలో రూ.1.06 కోట్ల మేర లబ్ధి పొందారు. 2020లో 159 మందికి రూ. 0.16 కోట్లు చెల్లించారు. 2021లో 217 మందికి రూ.0.22 కోట్లు, 2022లో 204 మందికి రూ.0.20 కోట్లు, 2023లో 217 మందికి రూ.0.22 కోట్లు, 2024లో 267 మందికి రూ.0.27 కోట్ల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది.

మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లల్లో)
2019-20	159	0.16
2020-21	217	0.22
2021-22	204	0.20
2022-23	217	0.22
2023-24	267	0.27

డ్రైవర్ల కష్టాలు గుర్తించిన ఏకైక సీఎం వైఎస్ జగన్



ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్ల కష్టాలను గుర్తించిన ఏకైక సీఎం వైఎస్ జగన్. నేను సొంతంగా క్యాబ్ నడుపుతూ జీవిస్తున్నా. రోజూ బాడుగ దొరకదు. ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో సీఎం వైఎస్ జగన్ వాహన మిత్ర పథకం ద్వారా ఏటా రూ.10వేలు చెల్లిస్తుండడంతో ఆర్థికంగా ఊరట లభించింది. జగన్ మేలును జన్మలో మరవలేను.

–దినేష్, క్యాబ్ డ్రైవర్, గుడిబండ

ఆటో నిర్వహణకు రూ.10వేలు ఉపయోగించుకుంటా



వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఎంతగానో ఆదుకుంటోంది. ఈ పథకం కింద ఏటా రూ.10వేలు అందుతోంది. ఈ మొత్తాన్ని ఆటో నిర్వహణ, బీమా చెల్లించడానికి ఉపయోగించుకుంటా. ఆటోకు ప్రతి రోజూ గిరాకీ లేకపోయినా ప్రభుత్వం నుంచి రూ.10వేలు వస్తుండడంతో ఊరట లభిస్తుంది.

–రఘు, ఆటో డ్రైవర్, జంబులబండ,గుడిబండ మండలం

గ్రామాల అభివృద్ధికి పూర్తి సహకారం

- వైఎస్ జగన్ రెండో పర్యాయం సీఎం కావడానికి సహకరించండి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



ఈరలక్కప్ప

మడకశిర: గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, జగనన్న రెండో పర్యాయం సీఎంగా ఎన్నికయ్యేందుకు సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు కృషి చేయాలని మడకశిర నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఉన్న సమస్యలను వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు పరిష్కరించి ముఖ్యమంత్రి జగన్‌కు మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. తాను స్థానిక ప్రజా ప్రతినిధుల విధుల్లో జోక్యం చేసుకోనని తెలిపారు. మీ పరిధిలోని నిధులను అభివృద్ధి పనుల కోసం స్వేచ్ఛగా ఖర్చు చేయాలని కోరారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు అండగా ఉంటానని తెలిపారు. వారి కష్టాల్లో కూడా పాలు పంచుకుంటానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయడానికి కృషి చేయాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌తోనే స్థానిక సంస్థలు బలపడ్డాయని తెలిపారు.

ప్రొటోకాల్ పాటించలేదు

లేపాక్షి: లేపాక్షిలో శనివారం జరిగిన బ్రహ్మరథోత్సవంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ప్రొటోకాల్ పాటించలేదని సర్పంచ్ ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జైకిసాన్, మండల కన్వీనర్ నారాయణస్వామి ఆరోపించారు. తాము కార్యక్రమానికి రాకముందే రథాన్ని లాగి అవమానపరిచారని తెలిపారు.

క్లుప్తంగా

కంప చెట్ల తొలగింపు



కంప చెట్ల తొలగింపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: హేమావతి శ్రీ సిద్దేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రోడ్డుకు ఇరువైపులా వున్న కంప చెట్ల తొలగింపును శనివారం ఎమ్మెల్యే తిప్పేస్వామి పరిశీలించారు. మండలంలోని కె.శివరం క్రాస్ రోడ్డు, నిద్రగట్ట రోడ్డు, బాణగెర రోడ్డు, అమరాపురం రోడ్డుకు ఇరు వైపులా కంప చెట్లు దట్టంగా పెరగడంతో ఆర్ అండ్‌బీ నిధుల ద్వారా జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. దీంతో ఆదివారం జరిగే అగ్నిగుండ మహోత్సవానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



తిమ్మారెడ్డిని పరామర్శిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: సింగేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తిమ్మారెడ్డి గుండె సమస్యతో సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకొన్న మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం తిమ్మారెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీస్ బలగాలు

హిందూపురం అర్బన్: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీస్‌బలగాలు శనివారం పట్టణంలోని రహమత్‌పూర్, మోడల్ కాలనీ, ఆటోనగర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ కంజాక్షన్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వారి భద్రతకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. సీఐ రియాజ్ అహమ్మద్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

లేపాక్షి: పట్టణంలో శనివారం జరిగిన వీరభద్ర స్వామి బ్రహ్మరథోత్సవంలో భాగంగా అన్నదాన సేవా ట్రస్ట్ దాదాపు 2500 మందికి అన్నదానం చేసింది. ముద్దిరెడ్డిపల్లికి చెందిన జగదీష్ బృందం, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చలపతి, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్, నంది వినాయక సేవా సమితి బృందం, లేపాక్షికి చెందిన దుర్గప్పలు అన్నదానం చేశారు. అంబేడ్కర్ యువజన సంఘం, లేపాక్షికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం, సత్యసాయి సేవాసమితి సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లును పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో పెసర బ్యాళ్లు, పానకం, డాక్టర్ గోపినాథ్ ఆధ్వర్యంలో నీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు.

తనిఖీలు ముమ్మరం చేయండి

హిందూపురం అర్బన్: అంతర్ రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాలైన కొడికొండ చెక్‌పోస్టు, తూమకుంట చెక్‌పోస్టును డీఎస్పీ కంజాక్షన్ శనివారం తనిఖీ చేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ నిఘా మరింత పెంచాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే వదలాలన్నారు. డివిజన్ పరిధిలో కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో సైతం నిఘా పెంచి మద్యం, డబ్బు రవాణాను కట్టడి చేస్తామని డీఎస్పీ అన్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ గంగాధర్ ఉన్నారు.

గుజరీలో మంటలు



దట్టంగా వ్యాపించిన పొగలు

సోమందేపల్లి: సోమందేపల్లిలోని కొత్తపల్లి క్రాస్ రోడ్డులో ఉన్న ఓ గుజరీ దుకాణంలో శనివారం దట్టమైన పొగలు కమ్ముకొని మంటలు చెలరేగాయి. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి నీటితో మంటలు ఆర్పివేశారు.

మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో టీడీపీ నాయకులు హనూక్, అన్సర్ అహ్మద్

హిందూపురం: హిందూపురం నియోజకవర్గ నాయకులు లేపాక్షి మండలానికి చెందిన మాజీ ఎంపీపీ హనూక్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్ అహ్మద్ శనివారం అనంతపురంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. టీడీపీలో కష్టించి పనిచేసే వారికి గుర్తింపులేదని, తమలాగే చాలామంది నాయకులు బయట చెప్పుకోలేక మదనపడుతున్నారని హనూక్, అన్సర్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపుతో పాటు మంచి అవకాశాలు కూడా కల్పిస్తుండటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలు బలోపేతం



గోరంట్లలో సహకార సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలో సహకార సంఘాలు బలోపేతమై అన్నదాతలకు విశేష సేవలు అందిస్తున్నాయని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. గోరంట్ల పట్టణంలో జిల్లా సహకార బ్యాంక్ నిధులు రూ.40 లక్షలతో సహకార సంఘం భవన నిర్మాణానికి శనివారం ఆమె భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ సహకార సంఘాలతో అన్నదాతలకు పరపతి పెరిగిందన్నారు. అంతకు ముందు మంత్రికి వైఎస్సార్‌సీపీ టౌన్ మాజీ కన్వీనర్ మేదర శంకర్ గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి మంత్రి పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్, మంత్రి భర్త చరణ్‌రెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరిశంకరరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ ఆశా, గోరంట్ల సహకార సంఘం అధ్యక్షుడు శివశంకరరెడ్డి, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, నార్శింపల్లి మాజీ సర్పంచ్ శివారెడ్డి, నాగేనాయక్, హరినాథరెడ్డి, నాగభూషణరెడ్డి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కోసం మళ్లీ జగనన్నే రావాలి



సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు



పెనుకొండ: టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



పరిగి: కండువా వేసి టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఉషశ్రీచరణ్

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: సంక్షేమ పథకాలు ఆగకుండా కొనసాగాలంటే జగనన్న రెండో పర్యాయం ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డు బీటీఆర్ కాలనీ, మారుతీనగర్ ప్రాంతాల్లో శనివారం ఆమె కౌన్సిలర్ అంజలితో కలిసి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో 175 సీట్లకు 175 సీట్లు గెలవడం ద్వారా రెండో పర్యాయం ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించి సంక్షేమ పథకాలను అందుకోవాలన్నారు. పేదలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వసతి దీవెన, విద్యాదీవెన, రైతుభరోసా, నేతన్న నేస్తం ఇలా ఎన్నో పథకాలను సీఎం జగన్ ప్రజలకు అందించారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాల నగదును పేదల ఖాతాలకు జమ చేస్తున్నారన్నారు. జగనన్నకు మద్దతు పలకకపోతే అబద్దాల టీడీపీ పేదలను కష్టాల్లోకి నెట్టేస్తుందన్నారు. నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ బోయసునీల్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు బోయనరసింహ, కౌన్సిలర్ అంజలి భర్త శ్రీరాములు, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, శేషాద్రి, రఘునాథరెడ్డి, జయశంకరరెడ్డి, రామాంజినేయులు, కొండలరాయుడు, కోఆప్షన్ సభ్యుడు నేమతుల్లా, ముహీబా, ఫరీద్, గుట్టూరు అంజినేయులు, బోయబాబు, గణేష్, యాసిన్ పాల్గొన్నారు.

నేడు పదో వార్డులో...

పట్టణంలోని 10వ వార్డులో ఆదివారం సాయంత్రం ఆత్మీయ పలకరింపు కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయనరసింహ శనివారం తెలిపారు. శ్రీరాములయ్య కాలనీ, వెంకటాపురం తండా, పరమేశ్వరపురంలో జరిగే కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు

పట్టణంలోని బీటీఆర్ కాలనీలో కౌన్సిలర్ అంజలి, శ్రీరాములు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన కాతూన్‌బీ, గంగరత్న, ఖాజావలి తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి ఉషశ్రీచరణ్ వారికి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.

పరిగి: బీచిగానిపల్లి పంచాయతీ కేంద్రంలోని టీడీపీకి చెందిన 15 కుటుంబాలు శనివారం మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. పెనుకొండలోని మంత్రి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీచిగానిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. దశాబ్ద కాలంగా టీడీపీలో తమకు సరైన గుర్తింపు లేదని, నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను చూసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు టీడీపీ కార్యకర్తలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

నేడు హేమావతిలో అగ్నిగుండ మహోత్సవం





సిద్ధేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఐ రాజకుమార్

అమరాపురం: సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హేమావతిలో అగ్నిగుండ మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మడకశిర సీఐ రాజకుమార్, ఎస్ఐ జనార్దననాయుడు తెలిపారు. ఏర్పాట్లపై వారు శనివారం ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, సర్పంచ్ తిప్పేస్వామితో చర్చించారు. హేమావతి నలు దిక్కుల నుంచి భక్తులు తరలి వస్తుండడంతో పోలీసు సిబ్బందితో ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా సలహ సూచనలు ఇచ్చినట్లు వారు తెలిపారు. దేవుని దర్శనం, అగ్నిగుండంలో వేసే ధూపం తదితర సమయాల్లో భక్తులు ఒకరికొకరు తోసుకోకుండా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు

నేడు హేమావతికి 18 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

మడకశిర: అగ్నిగుండ మహోత్సవాన్ని దృష్టిలో పెట్టుకుని ఆదివారం హేమావతికి 18 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపుతున్నట్లు డీఎం రామసుబ్బయ్య తెలిపారు.మడకశిర నుంచి 4, గుడిబండ నుంచి 4, అమరాపురం నుంచి 10 బస్సులను నడపుతామని తెలిపారు. భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా భానుపల్లకీ ఉత్సవం

అమరాపురం: సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం భానుపల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని పల్లకీలో కొలువుదీర్చి ఊరేగించారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, సర్పంచ్ తిప్పేస్వామి, ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి జాగరణ





పరిగిలో పరమేశ్వరుడికి అలంకరణ, హిందూపురంలో కొలువు దీరిన శైవక్షేత్రాల నమూనాలు

పరిగి/ పెనుకొండ/గోరంట్ల/రొద్దం/ అగళి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. శివ పార్వతుల కల్యాణాలు కమనీయంగా సాగాయి. రాత్రంతా జాగరణ చేసిన భక్తులు శనివారం ఉదయం శివాలయాలకు వెళ్లి పరమేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిగి, కొడిగెనహళ్లి, సంగమేశ్వరపల్లి వద్ద సంగమేశ్వర ఆలయం, పెనుకొండలోని కాశీ విశ్వేశ్వరాలయంలో హోమ వేడుకలను నిర్వహించారు. గోరంట్లలోని సోమేశ్వర ఆలయంలో శివపార్వతుల కళ్యాణం వైభవంగా జరిగింది. రొద్దం మండలం దండెపల్లి అవదూత సుబ్బరాయప్పస్వామి ఆశ్రమం, రుద్రపాద ఆశ్రమం, సానిపల్లి ఆశ్రమం, కోనమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగళి మండలం నరసాంబుది గ్రామంలో చంద్రమౌళేశ్వర స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఆకట్టుకుంటున్న శైవ క్షేత్రాల దర్శనం

హిందూపురం: హిందూపురం సత్యనారాయణపేటలో బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం ఓంశాంతి నిర్వాహకులు ఏర్పాటు చేసిన శైవ పుణ్య క్షేత్రాల దర్శన ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంటోంది. దేశంలోని శైవ క్షేత్రాల్లోని మూలవిరాట్‌లను పోలిన రూపాలు ఒకేసారి దర్శించుకునేలా శివలింగాలు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చి పుణ్యక్షేత్రాలను దర్శించి భక్తి పారవశ్యాన్ని పొందుతున్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యాహక్కు చట్టం కింద సీట్ల కేటాయింపు

అగళి: మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం12(1) మేరకు 1వ తరగతిలో ప్రవేశం కోసం సీట్లు కేటాయించినట్లు ఎంఈఓ భాస్కర్, ఎంఈఓ–2 చంద్రశేఖర్ తెలిపారు. అనాథపిల్లలకు, హెచ్ఐవీ ప్రభావితులకు 5 శాతం, షెడ్యూల్ కులాలవారికి 10 శాతం, షెడ్యూల్ తెగలకు 4 శాతం, బలహీన వర్గాలకు, మైనారిటీలకు 6 శాతం సీట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిర: నియోజకవర్గంలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు కారణంగా రొళ్ల, అగళి, గుడిబండ మండలాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ సుబ్రహ్మణ్యప్రసాద్ తెలిపారు. ఉదయం 7నుంచి 11 గంటల వరకు రత్నగిరి, రొళ్ల, బీజీహళ్లి, అగళి, మధూడి, హెచ్‌డీ హళ్లి, రామనపల్లి, మండలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నేడు పరిపూర్ణానందస్వామీజీ రాక

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి, కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం కాకినాడ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామీజీ దర్శించుకోనున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు ముద్దరాజు తెలిపారు. తొలుత చిగమతిఘట్ట గ్రామంలోని ముద్దరాజు తోటలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన

పావగడ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రోటరీ క్లబ్, హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌కే రంగ మందిరంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా శివారాధన నృత్యాన్ని మనోహరంగా అభినయించిన సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులను అభినందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మానం వెంకటస్వామి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సత్య లోకేశ్, హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య చికిత్సలు అందిస్తున్న వైద్యులు

పెనుకొండ: పట్టణంలో బాబయ్య దర్గా సమీపంలో శనివారం బెంగళూరుకు చెందిన సప్తగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. గుండెజబ్బులు, న్యూరో, కిడ్నీ, క్యాన్సర్ వ్యాధులకు సంబంధించి డాక్టర్ అభిషేక్, రందాస్, హరీష్, ప్రతీకరెడ్డి, ప్రకాష్‌లు 250 మంది రోగులకు వైద్యం అందించారు. దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా, ఆయన కుమారుడు నజర్‌హుస్సేని, పీఠాధిపతి కుమార్తె సయ్యదా తాహీరా తబసుమ్ అధ్యక్షతన జరిగిన శిబిరాన్ని నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ పర్యవేక్షించారు.

ఇంటింటికీ తాగునీరు

అమరాపురం: బసవనపల్లిలో తాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా సర్పంచ్ భాగ్యమ్మ చర్యలు చేపట్టారు. నీటి ఎద్దడి ఉన్న కాలనీల్లో ఇంటింటికీ పైపులైన్ ద్వారా నీరు అందించారు.

శివుడికి పూజలు చేసిన ఎమ్మెల్యే



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: శివరాత్రి సందర్భంగా ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ లింగదహళ్లి గ్రామ కొండ ప్రాంతంలో నెలకొన్న శివాలయాన్ని శనివారం సందర్శించి పరమేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు.

మొక్కలు నాటి పోషించాలి

అగళి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గ్రీన్ భారత్ ఫౌండర్ అండ్ చైర్మన్ శంకర్ నారాయణ అన్నారు. స్థానిక బీసీ హాస్టల్ ఆవరణలో శనివారం ఆయన మొక్కలు నాటారు. కామరాజు, హాస్టల్ వార్డెన్ సికిందర్‌బాషా పాల్గొన్నారు.

జాగరణలో గొడవ

పెనుకొండ రూరల్: హనుమపల్లిలో శనివారం రాత్రి శివరాత్రి జాగరణ జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తితో చంద్రమౌళి గొడవ పడ్డాడు. ఘటనలో రమేష్ స్వల్పంగా గాయపడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

అమరాపురం: గ్రామీణ మహిళలు తాము సంపాదించిన మొత్తంలో ఇంటి ఖర్చులు పోనూ కొద్దిగా పొదుపు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆర్డీటీ గుడిబండ ఏరియా టీం లీడర్ సావిత్ర పేర్కొన్నారు. ఉదుగూరు గ్రామంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏటీఎల్ మాట్లాడుతూ 84 మంది సభ్యులు 12 నెలలు పొదుపు చేసుకోగా ఒక్కొక్కరికి రూ.9వేలు ప్రకారం మొత్తం 84 మంది సభ్యులకు 7,56,000 నగదును బ్యాంకులో వారి పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌లు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఎస్టీఎల్.బాలయ్య, క్రిష్ణవేణి, చంద్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రొళ్ల: ఆర్.రంగాపురం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని నీటితో శుభ్రం చేసి మామిడి తోరణాలు, అరటి పిలకలు, పూలతో అలంకరించారు. అర్చకుడు జ్ఞానేంద్రబాబు స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. తర్వాత అన్నదానం చేశారు.

హిందూపురం: తూమకుంట చెక్‌పోస్ట్ కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్‌లో వాసవ్య మహిళా మండలి విప్రో కేర్ కుశాల్ ప్రతినిధుల ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘ సభ్యులతో కలిసి ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కోఆర్డినేటర్ శిరీశ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.